# శాశ్వత ఆనందం ఎలా వస్తుంది

కిం స్వరూప మిత్యాత్మ దర్శనే అవ్యయా భవా పూర్ణ చిత్సుఖం

భగవాన్ రమణ మహర్షి అందించిన 30 శ్లోకాల ఆత్మాజ్ఞానామృత గ్రంథం. ఉపదేశ సారంలోని 28వ శ్లోకమిది. పరిపూర్ణ చిదానందాన్ని పొందటానికి ఆత్మానుభూతికి శ్రీరమణులు ఈ గ్రంథంలో అందించిన అంతిమ ఉపదేశమిది. నా నిజ స్వరూపం ఏమిటి అని విచారణ చేసినప్పుడు ఆత్మానుభూతి కలిగి, తరిగిపోని, పుట్టుక లేని, నిండైన ఆనందం అనుభవంలో వుంటుంది. అంటే తాను అనంత, అఖండ, చిదానంద స్వరూపుడిగా వుండిపోతాడని దీని అర్థం.

ఈ లోకంలో ప్రతి ఒక్కరూ సుఖాన్ని, ఆనందాన్ని కోరుకుంటారు. అందుకోసం ఎన్నో విషయ వస్తువుల వెంట, విషయాదుల వెంట పిచ్చిపిచ్చిగా పరుగులు తీస్తూ, వాటిని అందుకుంటూ, అనుభవిస్తూ ఆనందిస్తారు. తరువాత మళ్ళీ ఒక వస్తువు కోసం, భోగం కోసం పరుగులు తీస్తారు. అందితే ఆనందం, అందకపోతే దుఃఖం. అందితే అంతటితో ఊరుకోవడం వుండదు. మరొక దానికోసం పరుగులు పెడతారు. ఇలా ఎప్పుడూ పరుగులు తీస్తూ, శాశ్వత సుఖాన్ని పొందలేక నిరాశ నిస్పృహలకు గురవుతున్నారు. మరి ఆనందం, శాశ్వతానందం ఎలా వస్తుంది? అది బయట వస్తువులలో వున్నదా? లేక లోపల నీలోనే వున్నదా? ఆనందం బయట వస్తువులలో లేదని తేలిపోయింది. కనుక నాలోనే వున్నదేమో అని ప్రతి ఒక్కరూ పరిశీలన చేయాలి.

అంటే నా యదార్థ స్వరూపం ఏమిటో తెలుసుకోవాలి. ప్రతి వస్తువుకూ ఒక సహజ స్వభావం వుంటుంది. ఆ వస్తువు దాని స్వభావాన్ని విడిచి వుండదు. అగ్ని స్వభావం వేడి. అగ్ని వేడిని విడిచి వుండదు. మంచు స్వభావం చల్లదనం. మంచు చల్లదనాన్ని విడిచి వుండదు. ఈ విధంగా ఆలోచిస్తే మన సహజ స్వభావం ఏమిటి? ఆనందమా? దుఃఖమా? ... మన సహజ స్వభావం దుఃఖం అనుకుందాం. అదే నిజమైతే మనం దుఃఖాన్ని విడిచి వుండలేము. ఎప్పుడూ దుఃఖం వుండాలనుకుంటాం.

తరువాయి 43వ పేజీలో

కానీ దుఃఖం కలిగితే మనం ఎందుకు దాన్ని పోగొట్టుకోవాలని ప్రయత్నిస్తున్నాము? ఎందుకంటే, ఆనందం మన సహజ స్వభావం. అందుకే దుఃఖం వస్తే బయటకు పంపివేయాలని అనుకుంటాం. ఎప్పుడూ సుఖంగా వుండాలనుకుంటాం. ఆనందం కలిగినప్పుడు దాన్ని పారద్రోలాలని చూడం సరికదా, ఎప్పటికీ అలాగే ఆనందంగా వుండాలని కోరుకుంటాం. ఆనందంగా లేకపోతే ఎలా ఆనందాన్ని, సుఖాన్ని పొందాలా? అని ఆలోచిస్తాం. కనుక మనం ఆనంద స్వరూపులమే. కానీ, అజ్ఞానం వలన ఆ విషయాన్ని తెలుసుకోలేక పోతున్నాం. మన నిజస్వరూపంలో మనం ఉండలేకపోతున్నాము.

నేను దేహాన్ని అనుకోవడం వలన, నేను ఆత్మని అని గ్రహించలేకపోవడం వలన ఈ సమస్యలన్నీ వస్తున్నాయి. నేను దేహాన్ని, దుఃఖంలో వున్నాను అనుకొని ఆనందం కోసం ఏవేవో విషయాలతో సంపర్కం పెట్టుకుంటున్నాం. రాత్రింబవళ్ళూ ఇలా సంబంధం పెట్టుకున్నా, కోరుకున్న ఆనందం మాత్రం లభ్యం కావడం లేదు. మరేం చేయాలి? అంటే, మన యదార్థ స్వరూపం ఆత్మయేనని గుర్తెరగాలి.

శాశ్వతానందం పొందాలి అంటే మనస్సు నిర్విషయం కావాలి. సంకల్పాలు రెండు రకాలు : శుద్ధ సంకల్పాలు, అశుద్ధ సంకల్పాలు. ముందుగా శుద్ధ సంకల్పాలనే చింతించాలి. మనస్సులో వచ్చే సంకల్పాలను ప్రయత్నపూర్వకంగా తగ్గించుకోవాలి. మనస్సుని నిర్విషయం చేసుకోవటమే మోక్షమని అమృతబిందూపనిషత్తు చెబుతోంది. మనస్సు నిర్విషయమైతే మనస్సు పరమార్థ వస్తువుపై నిలిచిపోతుంది. ఆత్మానందం లభిస్తుంది.

ఆత్మ ఆనంద స్వరూపం కనుక మనం ఎల్లప్పుడూ ఆనందంలో వున్నట్లే. కనుకనే ఈ దిశగా విచారణ సాగాలని శ్రీరమణులు చెప్పారు. అందుకు సద్గురువు మార్గదర్శనం, శాస్త్ర విచారణ, విచారం అవసరం!

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ

సంపుటి 41 సంచిక 4
పేజీలు 44
డిసెంబర్ 2021

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**

దాశరథీ శతకము ............................ ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట.................................... ............ 7
అగస్త్య హృదయం ......................... ..............9
హైదరాబాద్ శాఖలో కార్యక్రమాలు..11
ఆహారంలో దోషాలు ......................................12
మాయ......................... ......................................15
మనసెరిగిన అమ్మ ........................................16
శ్రీబాబు దివ్య లీలలు ..................................18
దేవుడే భోజనం పంపిస్తాడు .................19
బ్రహ్మావ్రాత ............. ........................................ 21
బాబూజీతో అనుభవాలు .............................25
గురుశక్తి..................... ................. ............... 26
కైవల్యోపనిషత్ ... ........................................28
పరమాత్ముని పట్ల కృతజ్ఞత ....................30
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు ......................31
వేంకటాద్రి ...................................................32
నిరీక్షణ ............................ ..............................34
సద్గురు ............................................... ................36
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38
విష్ణు కథలు ...... ............................ ...................40

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

17) **పరమదయానిధే పతితపావననామ హరే యటంచు సు**
**స్థిరమతులై సదాభజన సేయు మహాత్ముల పాదధూళి నా**
**శిరమునదాల్తుమీరటకు జేరకుడంచు యముండు కింకరో**
**త్కరముల కాన బెట్టునట దాశరథీ కరుణాపయోనిధీ!**

భావం- 'దయకు సముద్రము వంటివాడవు, పాపులనుద్ధరించు పేరు గలవాడవు, హరీ!' యని నిలకడగల బుద్ధితో గొలుచు మహాత్ముల పాదధూళి నా శిరస్సుపై దాల్చుతాను. కాబట్టి వారి జోలికి పోవద్దని యముడు భటులను ఆజ్ఞాపిస్తాడుట దాశరథీ కరుణా పయోనిధీ!




*భగవంతుని ఒడిలో జీవించడమంటే ఏమిటి?
*పంది ఇంద్ర భోగాలు ఎందుకు వద్దన్నది?
*ప్రకృతికి పరమాత్మకి అనుసంధానం చేసేది ఎవరు?
*సాధకుడికి ఏది కూడదని శ్రీబాబు హెచ్చరించేవారు?
*శ్రీరామ నవమినాడు వాన ఎందుకు కురిసింది?
*సాధువు మనస్సులో దుర్బుద్ధి ఎందుకు కలిగింది?
*మృత్యుదేవత ఎందుకు ఆశ్చర్యపోయింది?
*లక్ష్మణస్వామి ఎవరి నాలుకపై బీజాక్షరాలు వ్రాశాడు?
*ఏది కాలసర్పం కోరల నుండి తప్పించుకోగలదు?

***సమాధానాలు లోపలి పేజీలలో............................***

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

6-12-1980.

ఈరోజు రాత్రి 9గం॥లకు వాకింగ్‌లో బోధచేస్తూ, "నేను అనబడే అహం దర్శించేది. జగత్తు దర్శింపబడేది. అహం తొలగిపోతే అసలు నేను మిగులుతుంది. దానికి దర్శించేది. దర్శింపబడేది ఉండదు" అన్నారు శ్రీ బాబూజీ.



ఇంతలో చరణ్‌దాస్ కలుగ జేసుకొని 'పరమాత్ముడికి కష్టాలు తెలియవు. ఈ కష్టాలన్నీ మనకే. వెధవ మనస్సుతో వచ్చింది చిక్కు' అన్నాడు.

శ్రీబాబూజీ వెంటనే కలుగ జేసుకుని "నువ్వు వెధవవి అయితే మనస్సు ఎలా స్థిరపడుతుంది. అన్నము విస్తరి ఎదురుగా ఉంటే దానిని తినకుండా అది లోపలికి వెళ్ళాలనుకుంటే ఎలాగు? ఇదంతా అజ్ఞానం. అజ్ఞానంతో కూడిన మనస్సే ఇటువంటివన్నీ ఆలోచిస్తుంది. దీనికంతకు సోమరితనమే కారణం. సోమరితనాన్ని జయించాలి నాయనా! వాంఛలతో, కోరికలతో మానవుడు సాలెగూటిలో చిక్కుకుంటాడు" అన్నారు.

ఇంతలో విఠల్ చరణ్‌దాస్ మాట్లాడుతూ 'నాకు తత్త్వ విచారణతో తల పగిలిపోతున్నది' అన్నాడు.

శ్రీ బాబూజీ కలుగజేసుకొని "నీ మనస్సు స్థిరపడేవరకు నువ్వు సంకీర్తన విను నాయనా! అన్నారు. ప్రార్థనా మందిరంలో ఉపన్యాసం విన్నారా?" అని అడిగారు మమ్మల్ని శ్రీ బాబూజీ.

"విన్నాము"అని మేము చెప్పాము.

శ్రీ బాబూజీ తిరిగి మాట్లాడుతూ "సత్యగురువు సిద్ధిపొందిన తర్వాత ఆ సమాధిని ఎవరు ఆశ్రయించుకుని ఉంటారో వారిపై సత్యగురువు సగుణ స్థితిలో కన్నా నిర్గుణస్థితిలో ఇంకా ఎక్కువ

శక్తివంతమైన జ్ఞానకిరణాలు ప్రసరిస్తాడు. శుద్ధి చెందిన అంతఃకరణ చతుష్టయాన్ని కాలసర్పం యొక్క కోరలు ఏమీ చేయలేవు. తాబేలు చూడండి అవసరం అయినప్పుడు దాని నాలుగుకాళ్ళు వెలుపలికి వచ్చి చలనానికి తోడ్పడతాయి. ప్రమాద పరిస్థితి వచ్చినప్పుడు అవి తిరిగి లోపలికి ముడుచుకుపోయి తాబేలు తనను తాను రక్షించుకుంటుంది.

సత్యగురువుని ఆశ్రయించిన వానికి ఏ లోటూ ఉండదు. కాని మోక్షము కావాలి అన్న సంకల్పము కూడా కర్మబంధనను కలుగజేసి పునర్జన్మకు దారితీస్తుంది. ఆ సంకల్పము కూడా మిగలకూడదు. అదే సమాధి స్థితి. అక్కడ ఆనందం అనుభవించటమేగాని వ్యక్తం చేయలేడు.

పంచదార నోటిలో వేసుకున్నప్పుడు మాధుర్యాన్ని అనుభవిస్తాడు. ఆ మాధుర్యాన్ని వ్యక్తం చేయగలడా! చీకటి వెలుగులో కలిసినప్పుడు అది దానిలో లయమైపోతుంది. ఆ చీకటి ఏమైందో తెలియదు" అన్నారు శ్రీ బాబు.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా డిసెంబర్ 2021, జనవరి2022 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోనండి.

***డిసెంబర్ 2021 :*** AS 2424, 2994, 4955, 6466, 8430, 8493 to 8498, 8553, 8568 to 8570, 8572 to 8580, 8582 to 8592, LM 4290, 4296, 4298, 4300, 4301, 4303, 4305 to 4307

***జనవరి 2022 :*** AS 0405, 5127, 6508, 7000, 7428, 8511, 8516, 8593, 8595, 8599, 8602 to 8616, 8633 LM 4310, 4311, 4340, 4341.

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

*జీవబ్రహ్మైక్య అనుసంధానం*

**ఎదురైనారా ఎవరైనా ఈ యమునా నదీ తీరానా?**
**1. శిరమున సుందర పింఛముతో**
**ఉరమున మరకత పతకముతో**
**కమ్మదనాలను కరిగిపోయి ఆ**
**కరమున మోహన వేణువుతో ...।ఎదు।**
**2. వెడద వెడదలగు కన్నులతో**
**సకల బెడదలను బాపు చూపులతో**
**కాళింగ విషంగ ఫణములను**
**కరగించిన చిన్ని అడుగులతో**
**(మురిపించిన ముద్దు అడుగులతో)।ఎదు।**



అని శ్రీమాతాజీ కీర్తనను ఆలపించి, ఈ విధంగా బోధ చేశారు......

కృష్ణుడిని తలచుకునే సరికల్లా అందరికీ చాలా ఆనందంగా వుంటుంది. అందులోను మన బుజ్జి బాల కృష్ణుడు మరీను. ఆయన అల్లరిలోనే ఎంత ఆనందం వుంది! రాజకీయాలలోని కృష్ణుడు మనకొద్దు.

ప్రకృతికీ, పరమాత్మకీ అనుసంధానం చేసేది గురుదేవుడు. రాధని పిలచి, నందుడు తమ చిన్ని కృష్ణుడిని ఆమెకు అప్పగించి, తమ ఇంటిలో దింపిరమ్మనమని పంపించాడుట. ఎందుకని? ఈ విధంగా జీవుడికి పరమాత్మతో వుండే అవకాశం దక్కింది. ఈ సన్నివేశాన్ని శ్రీ జయదేవ మహాకవి తన గీతగోవింద కావ్యంలో మొట్ట మొదటి శ్లోకంలో ఈ విధంగా వర్ణించాడు....

**వనభువ శ్యామాస్తమాలద్రుమైః నక్తమ్ భీరురయమ్। త్వమేవ తదిమమ్। రాధే । గృహం ప్రాపయ। ఇత్థం నందనిదేశతశ్చలితయోః ప్రత్యధ్వ కుంజ ద్రుమమ్ రాధా మాధవ యోర్జయంతి యమునాకూలే రహః కేళయః ॥**

ఆకాశమంతా దట్టమైన నల్లని కృష్ణ మేఘాలతో నిండి పోయింది. ఆ చీకటి రాత్రి; వనమంతా నల్లని కానుగ చెట్లు; అంతా చిమ్మచీకటి; హృదయమంతా భయంతో నిండిపోయింది. ఓ రాధా!

నీవే ఈ కృష్ణుడిని ఇంటికి చేర్చు, అని నందుడి చేత నిర్దేశింపబడిన రాధ, కృష్ణుణ్ణి తీసుకుని ఆ యమునా తీరంలో వెళ్తుంది. రాధా మాధవులు ఆ ఇసుక తిన్నెలలోను, పొదరిండ్లలోనూ, చక్కగా రహస్యంగా ఆటలు ఆడుకుంటున్నారుట.

ఇక్కడ రాధా, కృష్ణులు అంటే జీవుడు - పరమాత్మ. వీరిద్దరినీ ఏకం చేసేది ఆచార్యదేవుడు. ఆయనే నందుడు. రాధ అంటే 'ధార'గా కృష్ణ నామం చేసే భక్త హృదయం అని శ్రీగురుదేవులు చెప్పి వున్నారు. రాధ నిరంతరం తన మదిలో కృష్ణ నామాన్ని మధిస్తుంది. అటువంటి జీవాత్మ, పరమాత్మతో కలసి ఆడుకునే కేళి ***జీవబ్రహ్మైక్య అనుసంధానం*** - ఇది కేవలం శ్రీ సద్గురుదేవుల కృప వలనే సాధ్యమవుతుంది. నీ మనస్సుతోనే దాన్ని గుర్తించాలి. అప్పుడే ఆత్మానందం కలుగుతుంది. (పుట్టు మచ్చలాగా అతుక్కుపోయినప్పుడు).

జీవుడు పరమాత్మతో ఎప్పుడూ కలిసే వున్నా, దానిని మనస్సుతో గుర్తించినప్పుడే ఆ ఆనందాన్ని అనుభవిస్తాం. ఆ మురళీ మనోహరుడు శిరమున పింఛముతో, వేణువుతో ఎక్కడున్నాడు అని మనం వెతుక్కోక పోతే ధ్యానం ఎలా కుదురుతుందండీ? మనం ధ్యానానికి కూర్చుని అలా వెదుక్కోవడం లేదా? ఎవరైనా చూశారా అమ్మా? అని వెదుక్కుంటూ, భావన అంచెలంచెలుగా చేయాలి. అది నిర్మలమైన హృదయంలోనే ప్రకాశిస్తుంది. సకల చరాచర ప్రపంచమంతా వ్యాపించి, మనని భవసాగరం నుండి ఉద్ధరించే ఆయన వెడద వెడదలగు కన్నులతో వుంటాడు. ఆయనెక్కడైనా ఎదురయ్యాడా?

నిద్రకి తావివ్వకండి. ఈ క్షణమే నీదనుకో- మరుక్షణమే లేదనుకో. అవాంతరాలను సవాలు చేసి, అవకాశాలుగా మార్చుకో. మన జీవితానికి ప్రతీ శ్వాస ఆఖరు శ్వాసే. ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి. పది అడుగులు బజార్ల వైపు వేస్తూ, ఒకటో రెండో ఇటువేస్తే మనకి భగవంతుడు ఎక్కడ కనబడతాడు? ఏమరుపాటు లేకుండా, భగవంతునిపై మనస్సు నిలబెట్టడమే ధ్యానం. సంకల్పాలను బలవంతంగా అణచాలని చూస్తే అవి స్ప్రింగ్ లాగా తిరిగి కొడుతుంది. వాటిని నెమ్మదిగా మనస్సుతో నచ్చచెప్పి, ఏకాగ్రం చేయాలి. అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడుగాక!!

# అగస్త్య హృదయం

గత సంచిక తరువాయి - వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**హిరణ్య గర్భః శిశిరః స్తపనో భాస్కరో రవిః।**

**అగ్ని గర్భో౽ దితేః పుత్రః శంఖః శిశిర నాశనః॥**

సృష్టికర్తయైన బ్రహ్మదేవుడై బ్రహ్మాండములను తన ఉదరమందు కలవాడునూ, శీతోష్ణములను ప్రసాదిస్తూ దినకారకుడయిన వాడునూ, సకల లోకములకూ స్తుతి పాత్రుడునూ, అగ్నిని గర్భమునందు వుంచిన అదితి కుమారుడునూ, సాయం సమయాలలో స్వయముగా శాంతించువాడునూ మరియు మంచును తొలగించువాడును.

ఈ శ్లోకము ద్వారా అగస్త్యులు అపారమూ, అనంతమూ అయిన గురుశక్తిని ప్రకటించడమే కాక, గురువు సాధకుడిని తరింపజేసే మార్గము కూడా తెలియజేస్తున్నారు.

**హిరణ్యగర్భః** అన్న సంబోధన గురుపరమాత్మ హిరణ్యగర్భుడైన బ్రహ్మదేవుడిగా, సృష్టకర్తగా వివరిస్తోంది. అయితే హిరణ్యము అన్న పదమునకు హితము మరియు రమ్యము అన్న భావన వర్తిస్తే రమ్యమై (హితమును కలిగించేది) సత్యవస్తువును తెలియపరచే గురువాక్కులే హిరణ్యములు. ఆ వాక్కుల చేత మనందరినీ ఉద్ధరిస్తున్న హృదయ బాబే మన పాలిట హిరణ్యగర్భులు.

**శిశిరః తపనః** అన్న శబ్దములు ద్వంద్వములైన శీతోష్ణములను సూచిస్తూ, సాధకుడు గీతాచార్యుడు వివరించినట్లు ద్వంద్వాతీతుడై **శీతోష్ణ సుఖదుఃఖేషు సమస్సంగ వివర్జితః** అన్న విధంగా శీతోష్ణములను, సుఖదుఃఖాలను సమత్వముతో దర్శించాలని గుర్తుచేస్తున్నాయి. గురుదేవులే స్వయం ప్రకాశస్వరూపులై అజ్ఞానమును రూపుమాపి, అహము (దినము లేక పగలు అనబడే) పరిపూర్ణ జ్ఞాన ప్రదాతలన్న విషయమును **అహస్కరః** అన్న సంబోధన వివరిస్తోంది.

**రూయతే స్తూయతే ఇతి రవిః** - అని వివరింపబడిన విధంగా సర్వుల చేత స్తుతింపబడే గురుదేవులను **రవిః** అన్న విశేషణముతో శ్లాఘిస్తున్నారు. **శంఖః** అన్న శబ్దముతో సాయం సమయంలో శమించిన సూర్యుని వలె గురుదేవులు వారిని శరణన్న వారందరి తాపమును హరించి,

శుభమునూ, సుఖమునూ చేకూస్తున్నారు. **ఓం సంసార తాప సంహర్త్రే నమః ; ఓం తాపఘ్నాయ నమః** అని మనము నిత్యమూ ఆరాధించుకునే శ్రీగురుదేవుల నామములు ఈ భావననే ప్రకటిస్తున్నాయి.

**అగ్నిగర్భః** అన్న ప్రస్తావన **అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః** అని బోధించి, వైశ్వానర రూపంలో జీవనాధారమై అందరిలో ప్రకాశిస్తున్న జగద్గురువులను సూచిస్తోంది. **శిశిర నాశనః** అన్న శబ్దమును జడత్వమును పోగొట్టేవాడు అన్న భావముతో గ్రహించాలి. సాధకుడికి సోమరితనము కూడదని శ్రీబాబు పలుమార్లు హెచ్చరించే వారు. మంచు శిశిరము చే కప్పబడిన అద్దము ఏ విధంగా నిజరూపమును ప్రతిఫలింప చేయలేదో అదే విధంగా మాయచేత కప్పబడినప్పుడు సత్యవస్తువును దర్శించలేము. శ్రీమాతాజీ తమ బోధలో **స్వమాయయా అంధీకృత సర్వలోక జ్ఞాన ప్రదీపం కురు తే నమోస్తు** అని వివరించినట్లు, మాయతో అంధీకృతమైన లోకానికి జ్ఞాన ప్రదీప దాయకులైన గురుదేవుల ఆగమనంతోనే శిశిర నాశనము లేక అజ్ఞాన నిర్మూలనము అవుతుందని ఈ శ్లోకం ద్వారా అగస్త్యులు వివరిస్తున్నారు.

- సశేషం



# హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**డిసెంబర్ 2021-**

3 శుక్ర - శ్రీ గురుదేవులు స్వస్వరూపలయం చెందిన తేదీ - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

9 గురు - సుబ్రహ్మణ్య షష్ఠి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

14 మంగళ - గీతాజయంతి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

16 గురు - ధనుర్మాస వ్రత ప్రారంభం

18 శని - మార్గశిర పూర్ణిమ, దత్త జయంతి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

25 శని - క్రిస్మస్ - ఉ11గం. శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

29 బుధ - శ్రీగురుదశమి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

**జనవరి 2022-**

1 శని - ఆంగ్ల సంవత్సరాది- సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

13 గురు - ముక్కోటి ఏకాదశి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

14 శుక్ర - భోగి - ఉత్తరాయణం - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట, భక్తసమారాధన.

15 శని - సంక్రాంతి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

17 సోమ - పుష్య పూర్ణిమ - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

27 గురు - శ్రీగురుదశమి - సా. 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

## ఆహారంలో దోషాలు

ఎ. శ్రీనివాస శాస్త్రి

మనం తీసుకునే ఆహారంలో అయిదు విధములైన దోషాలు వున్నాయి. 1. అర్థ దోషం. 2. నిమిత్త దోషం. 3. స్థాన దోషం. 4. గుణ దోషం. 5. సంస్కార దోషం. ఈ అయిదు దోషాలను గుర్తించి స్వీకరించకపోతే ఎన్నో అనర్థాలు కలుగుతాయని పెద్దలు చెబుతారు.

**అర్థ దోషం -**

ఒక సాధువు తన శిష్యుని ఇంటికి భోజనానికి వెళ్ళాడు. భోజనం చేస్తున్నప్పుడు ఎవరో ఒక వ్యక్తి వచ్చి, ఆ శిష్యునికి ధనంతో వున్న మూట ఇవ్వడం చూశాడు సాధువు. భోజనం చేశాక సాధువు ఒక గదిలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆ గదిలోనే తన శిష్యుడు దాచిన ధనం మూట వున్నది. హఠాత్తుగా సాధువు మనస్సులో ఒక దుర్బుద్ధి కలిగింది. ఆ మూటలో నుండి కొంత ధనం తీసి తన సంచిలో దాచుకున్నాడు. తరువాత ఆ శిష్యుని దగ్గర శెలవు తీసుకుని, తన ఆశ్రమానికి తిరిగి వెళ్ళిపోయాడు.

మరునాడు పూజా మందిరంలో తాను చేసిన పనికి సిగ్గుతో పశ్చాత్తాప పడ్డాడు ఆ సాధువు. తను శిష్యుని ఇంట్లో చేసిన దోష భూయిష్ఠమైన భోజనం వలనే  తనకా దుర్బుద్ధి పుట్టిందని, రాత్రి తిన్న ఆహారం జీర్ణమైపోయి, ప్రొద్దున్నే మలంగా విసర్జింపబడిన తరువాత తన మనస్సు తిరిగి శుద్ధమైనట్లు ఆ సాధువు అర్థం చేసుకున్నాడు. వెంటనే తాను తస్కరించిన డబ్బును తీసుకుని, శిష్యుని ఇంటికి వెళ్ళి జరిగినదంతా చెప్పి, ఆ డబ్బును అతనికి తిరిగి ఇచ్చేశాడు. శిష్యుడిని డబ్బు సంపాదన ఏ విధంగా చేస్తున్నావని ప్రశ్నించాడు. ఆ శిష్యుడు సిగ్గుతో తల వంచుకుని, 'స్వామీ! నన్ను క్షమించండి. ఇది సన్మార్గంలో వచ్చిన ధనం కాదు' అన్నాడు.

ఈ విధంగా సన్మార్గంలో సంపాదించని డబ్బుతో కొన్న పదార్థాలతో తయారు చేసిన ఆహారం భుజించడమే అర్థదోషం. మనం న్యాయంగా సంపాదించిన దానితోనే ఆహారం తయారుచేసుకుని భుజించాలి.

**నిమిత్త దోషం -**

మనం తినే ఆహారాన్ని వండేవారు కూడా మంచి మనస్సు కలవారై వుండి, సత్యశీలత కలిగి, దయ, ప్రేమ గల మంచి స్వభావము కలిగినవారై వుండాలి. వండిన ఆహారాన్ని క్రిమికీటకాలు, పక్షులు, జంతువులు తాకకూడదు. ఆహారం మీద దుమ్ము, శిరోజాలు వంటివి పడకూడదు. అపరిశుభ్రమైన ఆహారం మనస్సుకు అసహ్యతను కలిగిస్తుంది. దుష్టులైనవారి చేతి వంట భుజిస్తే వారి దుష్టగుణాలు అవతలివారికి కూడా కలుగుతాయి.

భీష్మాచార్యులవారు కురుక్షేత్ర యుద్ధంలో బాణాలతో కొట్టబడి యుద్ధం ముగిసేవరకు అంపశయ్య మీద ప్రాణాలతోనే వున్నారు. ఆయన చుట్టూ పాండవులు, ద్రౌపది, శ్రీకృష్ణుడు వున్నారు. వారందరికీ భీష్ముడు మంచి మంచి విషయాలను బోధిస్తూ వచ్చాడు. అప్పుడు ద్రౌపదికి ఒక ఆలోచన కలిగింది. 'ఇప్పుడు ఇంత వివేకంగా ఆలోచిస్తున్న భీష్ముడు, ఆనాడు కురు సభలో నాకు వస్త్రాపహరణం చేస్తున్నప్పుడు ఎందుకు మౌనం వహించాడు? ఎదిరించి ఎందుకు మాట్లాడలేకపోయాడు?' అని మనస్సులో అనుకుంటోంది.

ఆమె మనస్సులోని ఆలోచనలను కనిపెట్టిన భీష్ముడు 'అమ్మా! ద్రౌపదీ! అప్పుడు నేను దుర్యోధనుని ప్రాపకంలో, వారిచ్చిన ఆహారాన్ని భుజిస్తున్నాను. నా స్వీయ బుద్ధిని ఆ ఆహారం తుడిచి పెట్టింది. శరాఘాతములతో, ఛిద్రమైన దేహంతో ఇన్ని రోజులు నిరాహారిగా వున్నందువల్ల, పాత రక్తం బిందువులుగా బయటకు పోయి, ఇప్పుడు నేను పవిత్రుడనయ్యాను. నా బుద్ధి వికసించి, మీకు మంచి మాటలు చెప్పగలుగుతున్నాను' అన్నాడు భీష్ముడు. చెడ్డ గుణములు గలవారు ఇచ్చినది తిన్నందువలన మనిషిలోని మంచి గుణాలు నశించి, నిమిత్త దోషం ఏర్పడుతుంది.

**స్థాన దోషం -**

ఏ స్థలంలో ఆహారం వండబడుతున్నదో, అక్కడ మంచి ప్రకంపనలు వుండాలి. వంటచేసే సమయంలో అనవసరమైన చర్చలు, వివాదాల వలన చేయబడిన వంట కూడా పాడయిపోతుంది. యుద్ధరంగంలో, కోర్టులు, రచ్చబండలు వున్న చోట్లలో వండిన వంటలు

అంత మంచివి కావు.

దుర్యోధనుడు ఒకసారి 56 రకాల వంటలు వండించి శ్రీకృష్ణుని విందు భోజనానికి పిలిచాడు. కానీ, శ్రీకృష్ణుడు దుర్యోధనుని పిలుపును నిరాకరించి, విదురుని ఇంటికి భోజనానికి వెళ్ళాడు. కృష్ణుడిని చూడగానే, విదురుని భార్య సంతోషంగా ఆహ్వానించి ఉపచారాలు చేసింది. తినడానికి ఏమి పెట్టాలా అని ఆలోచించి, ఆనంద సంభ్రమాలతో తొందరపాటుతో అరటిపండు తొక్క వలచి, పండు ఇవ్వడానికి బదులుగా, చేతికి తొక్కను అందించింది. కృష్ణుడు దానిని సంతోషంగా భుజించాడు. ఇది చూసిన విదురుడు తన భార్యవైపు కోపంగా చూశాడు. అప్పుడు శ్రీకృష్ణుడు 'విదురా! నేను ఆప్యాయతతో కూడిన ప్రేమ కోసం ఎదురు చూస్తున్నాను. నిజమైన శ్రద్ధా భక్తులతో ఇచ్చినది అది కాయయైనా, పండు అయినా, ఆకైనా, నీరైనా ఏది ఇచ్చినా సరే సంతోషంగా తీసుకుంటాను' అన్నాడు. మనం ఆహారం వడ్డించినప్పుడు ప్రేమతో వడ్డించాలి.

**గుణ దోషం -**

మనం వండే ఆహారం సాత్వికాహారంగా వుండాలి. సాత్వికాహారం ఆధ్యాత్మికాభివృద్ధిని కలిగిస్తుంది. రజోగుణం కలిగించే ఆహారం మనిషిని లౌకిక మాయలో పడేస్తుంది. స్వార్థాన్ని పెంచుతుంది.

**సంస్కార దోషం -**

ఆహారం వండేవారి సంస్కారాన్ని బట్టి దోషం ఏర్పడుతుంది. సంస్కారవంతుల చేతివంట ఆరోగ్యాన్ని ఇస్తే, సంస్కారహీనుల చేతివంట లేనిపోని రోగాలను తెచ్చిపెడుతుంది.

ఆ రకమైన అనేక దోషభూయిష్టములైన ఆహారములనే మనం ఇప్పుడు ఎంతో ఇష్టంగా తింటూ ఎన్నో అనర్థాలకు కారణం అవుతున్నాము.

# మాయ

- ఎన్. కుట్టీ

ఒక్కొక్కసారి ద్రష్టలు, జ్ఞానులు కూడా మాయలో పడతారు. ఒకసారి నారద మహర్షి సంచారం చేస్తుండగా ఇంద్రుడు శాపవశాత్తు ఒక చెరువులో, బురదలో పంది రూపంలో కొట్టుమిట్టాడుతూ వుండటం కనిపించింది. నారద మహర్షికి ఇంద్రుడిపై జాలి కలిగి, తన మనస్సులో 'ఆహా! ఇంద్రభోగం అనుభవించాల్సిన ప్రభువు ఇలా పంది రూపంలో, ఈ చెరువులో, ఈ బురదలో ఈదులాడుతున్నాడే! ఇప్పుడు ఇతడిని ఎలా శాప విముక్తుణ్ణి చేయాలా!' అనుకున్నాడు.

'ఓ ఇంద్రా! నిన్ను చూస్తే బాధ కలుగుతోంది. ఎలా వుండవలసిన వాడవు ఇలా ఉన్నావు! నిన్ను ఈ పంది రూపం నుండి బయటపడి నీ స్వర్గలోకానికి వెళ్ళగలిగే మంత్రం ఒకటి నా దగ్గర వున్నది, అది వుపయోగించి నిన్ను ఇంద్రుడిగా మారుస్తాను. అప్పుడు నీవు హాయిగా నీలోకానికి వెళ్ళి ఎప్పటి లాగా స్వర్గ సుఖాలు అనుభవిస్తూ హాయిగా వుండవచ్చు' అని చెప్పాడు నారద మహర్షి ఇంద్రుడితో.

అప్పుడు పంది రూపంలో వున్న ఇంద్రుడు, 'ఓ నారద మునీంద్రా! నేను నా భార్యా (ఆడపంది), పిల్లలతో (పందిపిల్లలు) ఈ చెరువులోని బురదలో హాయిగా ఆనందంగా ఈదుతూ సుఖంగా వున్నాను. నా ఈ ఆనందాన్ని నువ్వు భగ్నం చేయవద్దు. నాకు ఈ పంది భార్య, పంది పిల్లలతో కలిసి జీవించడం ఎంతో ఆనందాన్నిస్తోంది. నాకు ఏ ఇంద్రభోగాలు వద్దు' అని చెప్పాడు.

నారద మహర్షి ఎంతగా నచ్చచెప్పాలని చూసినా పంది రూపంలో వున్న ఇంద్రుడు ససేమిరా కాదన్నాడు. అప్పుడు నారదమహర్షి 'ఎవరి అదృష్టాన్ని కానీ, దురదృష్టాన్ని కానీ ఎవరూ మార్చలేరు' అని తన దారిన తాను వెళ్ళిపోయాడు. కొన్ని రోజులకు పెద్ద తుఫాను వచ్చి పంది ఇంద్రుడి భార్య, పిల్లలు ఆ తుఫాను తాకిడికి గురియై మరణించాయి. అది చూసిన పంది ఇంద్రుడు ఎంతో దుఃఖించి తాను కూడా మరణించడానికి సిద్ధమైనాడు. ఆ పంది భార్య, పంది పిల్లలు లేకుండా తాను జీవించలేను అనుకున్నాడు ఇంద్ర పంది. అప్పుడు అతనికి జ్ఞానోదయం అయింది 'అయ్యో! నేను నారద మహర్షి చెప్పినట్లు విని వుంటే, ఈ పంది జన్మను వదిలించుకుని హాయిగా ఇంద్ర భోగాలు అనుభవించేవాడిని కదా!' అని దుఃఖించాడు. **అదే మాయ!**

**నీతి - పంది బురద మెచ్చు పన్నీరు మెచ్చునా! విశ్వదాభిరామ! వినురవేమ!**

## మనసెరిగిన అమ్మ

ఎమ్. జగన్నాథరాజు

'1988 సం.లో సిద్ధి పొందిన బాబు ఇప్పుడు మన ఎదుట లేరు' అని అనుకోరాదు. అది చాలా పొరపాటు. సద్గురువు సర్వకాల సర్వావస్థలలోనూ వున్నారు. ఇది ప్రాపంచిక ప్రమాణం. యూనివర్సల్ ట్రూత్! గురువును ఒక రూపానికి పరిమితం చేయరాదు. నిరాకారుడిగా, నిర్గుణుడుగా గురువును తెలుసుకోవాలి. గురుతత్వాన్ని గ్రహించాలి. శ్రీబాబు తన రూపం మార్చి శ్రీమాతాజీగా ప్రకాశిస్తున్నారు. 'శ్రీబాబు మాట అమ్మ నోట'.

శ్రీబాబు తన 'సర్వ మానవాళి శ్రేయస్సు' అనే యజ్ఞాన్ని మాతాజీవారి ద్వారా నెరవేరుస్తున్నారు. శ్రీబాబు లీలలను మాతాజీ ద్వారా భక్తులు గ్రహిస్తున్నారు, ఆనందిస్తున్నారు. బాబుకు, మాతాజీకీ తేడా లేదు. రూపంలో భేదమే తప్ప, తత్వంలో ఒక్కటే.

శ్రీ మాతాజీ ఒకసారి కొంతమంది భక్తులతో కలసి, విజయవాడలోని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్ల ఆలయానికి వెళ్ళారు. డా॥ వేలమూరి వెంకట రమణ ప్రసాద్‌గారు కూడా వారితో కలసి వెళ్ళారు. వారినోటితో చెప్పిన సంఘటనే ఇది....

గుడిలోకి మాతాజీ రావడం చూసిన ఒక భక్తురాలు హడావిడిగా వచ్చి, శ్రీ మాతాజీకి నమస్కరించారు. మాతాజీ ఆగారు. ఆమె ఒక మంచి పెద్ద తామర పువ్వును మాతాజీకి ఇచ్చి, 'అమ్మా! నేను చాలా కాలంగా అమ్మవారి సేవ చేసుకుంటున్నాను. నాకు నిన్న రాత్రి కలలో అమ్మవారు దర్శనమిచ్చి, 'రేపు నేను నీకు ఆలయంలో దర్శనమిస్తాను కానీ, ఈ రూపంలో కాదు, వేరే రూపంలో అని, వెంటనే మీ రూపంలో కనిపించింది' అని చెప్పి ఆమె నమస్కరించింది. మాతాజీ ఆమెను చూసి చిరునవ్వు నవ్వి, ఆ పువ్వు వంక చాలాసేపు చూసి, దుర్గాదేవి గర్భగుడిలోకి, తరువాత మల్లేశ్వరస్వామి గర్భగుడిలోకి వెళ్ళారు. ఆ భక్తురాలు సమర్పించిన పువ్వును స్వామికి అందించారు. స్వామి సన్నిధిలో కాసేపు వుండి మాతాజీ బయటకు వచ్చారు.

ఇదంతా బయట నుండి ఆ భక్తురాలు గమనించారు. మాతాజీ బయటకు రాగానే ఆమె మళ్ళీ నమస్కరించి, తబ్బిబ్బవుతూ, 'అసలు

నేను ఆ పువ్వును అర్పిద్దామని తీసుకు వచ్చాను. కానీ, భక్తుల రద్దీలో నాకు కుదరలేదు. ఇంతలో మీరు వచ్చారు. మాతాజీకీ అర్పించు అని నా మనస్సు చెప్పింది. అలాగే చేశాను. మీ ద్వారా నా కోరిక నెరవేరింది. నాకోసమే మీరు వచ్చారేమో అనిపిస్తోంది. ధన్యోస్మి!' అన్నారు.

శ్రీ మాతాజీ చిరునవ్వుతో 'చాలా సంతోషం! మీ మనస్సు చాలా మంచిది. మన మనస్సులో మంచి భావన వుంటే, అంతా మంచే జరుగుతుంది' అని ఆమెను ఆశీర్వదించారు.

### పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**డిసెంబర్ 2021-**

16 గురు - ధనుర్మాస వ్రత ప్రారంభం. భక్తసమారాధన

18 శని - మార్గశిర పూర్ణిమ, దత్త జయంతి- శ్రీసద్గురుపాదపూజ

29 బుధ - శ్రీగురుదశమి - శ్రీసద్గురు పాదపూజ

**జనవరి 2022-**

13 గురు - ముక్కోటి ఏకాదశి - శ్రీ సద్గురుపాదపూజ, భక్త సమారాధన

14 శుక్ర - భోగి - శ్రీసద్గురుపాదపూజ.

15 శని - సంక్రాంతి - శ్రీసద్గురుపాదపూజ.

17 సోమ - పుష్య పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ

27 గురు - శ్రీగురుదశమి - శ్రీ సద్గురుపాదపూజ, భక్త సమారాధన.

## శ్రీబాబు దివ్యలీలలు

- భోగరాజు భారతి

ఒకసారి శ్రీబాబు బోధనందిస్తూ, 'బాబు అనే నామంలో బీజాక్షరం లేదనుకున్నారా? బాబు అభేద్యమైన బీజాక్షరం. భగవంతుణ్ణి బాబు అని ధ్యానించుకోవచ్చు' అని చెప్పారు.

శ్రీబాబూజీ మహరాజ్ కాశీలోనూ, రామేశ్వరంలోనూ ఒకేసారి పరమేశ్వరుణ్ణి అర్చించారుట. ఈ విషయం తెలిసిన వారు ముగ్గురే మహాభక్తులు చిరంజీవిరాజుగారు, శేషగిరిరావుగారు, సోమయ్యగారు- ఈ విషయాన్ని శ్రీబాబూజీయే స్వయంగా భక్తులతో ప్రస్తావించారు.

శ్రీబాబు కామేశ్వరమ్మగారితోనూ, సుశీలతోనూ ఒక పాట ఎంతో ఇష్టంగా పాడించుకునేవారు. అదేమిటంటే 'ఏ నాటికైనా, ఈ మూగ వీణ ......' అనే పాట. అలాగ రాగాలు పలుకుతుంది అని ధైర్యంగా ఎదురు చూడాలి. మనకంటే ఎక్కువగా వున్నవారిని చూసి, మనం కనీసం ఈ మాత్రమైనా వున్నాం కదా, అని సంతోషిస్తే ఎప్పటికైనా మనం కూడా అంత ఎత్తుకు ఎదగ గలుగుతాము' అని చెప్పారు.

ఒకసారి శ్రీబాబు ఒక భక్తుడికి పాదపూజ చేసుకోమని అనుమతి ఇచ్చారు. వాళ్ళు అన్నీ సర్దుకుని ఎదురు చూస్తుంటే వీరు ఒక బెంగాలీ స్త్రీ వేషంలో తెల్లని చీరకట్టుకుని వెళ్ళారుట. వారెవరూ కూడా శ్రీబాబుని గుర్తించలేదని స్వయంగా శ్రీబాబు చెప్పారు.

శ్రీబాబు శ్రీహరిరావు గారింటికి వచ్చి మందిరంలో వున్న పటంలో (వారి కుమారుడు రమణ వేసిన చిత్రపటం) ఓంకారం చుట్టూ వ్రాసినది చదవమన్నారు. 'ఓం నమో భగవతే కాళీప్రసాదాయ' అని శ్రీహరిగారు చదివితే, ఈ మంత్రం చాలు నీకు జపించుకోమని లక్ష్యార్థాన్ని ప్రసాదించారు. మాకు జన్మనిచ్చిన తల్లి తులసీదేవిగారికి బాగా సుస్తీగా వున్న సమయంలో స్వప్నదర్శనమిచ్చి 'రామా! రామా!' అనుకోమని ప్రసాదించారు.

మరొకసారి శ్రీబాబు (మన ఆస్థాన కవిగారు పరిమి సుబ్రహ్మణ్యం గారి కుమారుడు) ఏలూరులో శ్రీ సుందర రామయ్య గారితోనూ, శ్రీహరిగారితోనూ రోడ్డు మీద నడుస్తూ ఎదురుగా వచ్చిన ఇద్దరు మనుష్యుల మధ్య నుండి వెళ్ళిపోయారుట. వాళ్ళకు ఏమీ గుర్తు తెలియలేదుట అదొక లీల!!

# దేవుడే భోజనం పంపిస్తాడు

సేకరణ - రావి శోభ

స్వామి వివేకానంద జీవితంలో జరిగిన ఒక అపూర్వ సంఘటన.......

ఒకసారి స్వామి వివేకానంద మండు వేసవిలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ఒక రైల్వే స్టేషన్‌లో వుండగా ఒక సంఘటన చోటు చేసుకుంది. వివేకానంద సన్యసించారు కనుక వారికి భగవత్ ప్రసాదంగా లభించినదే భుజిస్తూ వుండేవారు. భిక్షగా ముడిసరుకు లభిస్తే దాన్ని వండుకుని తినేవారు. లేదా భిక్షాటన చేస్తూ వుండేవారు.

ఒకనాడు స్వామికి తినడానికి ఏమీ దొరకలేదు. ఆయన వద్ద చిల్లిగవ్వ కూడా లేదు. ఆకలి, దాహర్తి, బడలికతో నేలపై కూర్చున్న స్వామీజీని గమనించి ఒక ధనవంతుడు చులకనగా మాట్లాడటం ఆరంభించాడు. అతని ఆలోచన ప్రకారం సన్యాసులు అంటే ఏ పనీ చేయకుండా సోమరిలాగా తిరుగుతూ, ఊళ్ళో వారిమీద భోజనానికై ఆధారపడుతూ, ప్రజలను మభ్యపెట్టి ధనం అపహరిస్తూ వుంటారనే భావనతో స్వామీజీతో ఇలా అన్నాడు.

'స్వామీ! చూడు చూడు నేనెంత మంచి భోజనం చేస్తున్నానో! నా వద్ద త్రాగటానికి చల్లని నీరు కూడా. నేను డబ్బులు సంపాదిస్తాను కాబట్టి నాకు మంచి మంచి వంటకాలు, వగైరాలు సమకూరాయి. ఇటువంటి భోజనం నువ్వు కనీసం కలలో అయినా పొందగలవా? ఏ సంపాదనా లేకుండా దేవుడు దేవుడు అంటూ తిరిగేవాడివి. అందుకే నీకు ఈ బాధలు. అయినా నువ్వు నమ్ముకున్న దేవుడు నీకేమిచ్చాడయ్యా? ఆకలి, బడలిక తప్ప' అంటూ దెప్పిపొడవటం మొదలు పెట్టాడు. స్వామీజీ ముఖంలో ఒక్క కండరం కూడా కదలలేదు. విగ్రహంలా కూర్చుని భగవంతుని స్మరిస్తున్నారు.

అప్పుడు ఒక అద్భుతం జరిగింది .................

ప్రక్క ఊరి జమిందారు ఒకరు స్వామీజీని వెతుక్కుంటూ వచ్చి, ఆయన పాదాలపై వ్రాలిపోయాడు. అతను స్వామితో ఇలా అన్నాడు 'మీ పాదాలను స్పృశించి సేవించే భాగ్యం కలగడం నా పట్ల శ్రీరామచంద్రమూర్తి అనుగ్రహం. దయచేసి ఈ భోజనాన్ని స్వీకరించండి' అని

ప్రాధేయపడ్డాడు.

'ఎవరు నాయనా నువ్వు? నేనెరుగనే నిన్ను. పొరబడుతున్నట్లున్నావు. నీవు వెతుకుతున్న వ్యక్తిని నేను కాదు' అని అంటుంటే, ఆ వ్యక్తి స్వామీజీ ముందు వెండి పీట వేసి, తాను తెచ్చిన భోజనాన్ని ఒక బంగారు అరిటాకు మీదకు మారుస్తూ... 'లేదు స్వామీ! నేను కలలో చూసినది మిమ్మల్నే. శ్రీరామచంద్రమూర్తి నాకు స్వయంగా కలలో దర్శనమిచ్చి, నాకు మిమ్మల్ని చూపిస్తూ నా బిడ్డ ఆకలితో అలమటిస్తుంటే, నువ్వు హాయిగా తిని నిద్రిస్తున్నావా! లే లేచి అతనికి భోజనం పెట్టు అని ఆజ్ఞాపించారు. ఆహా! ఏమి భాగ్యం! మీ వలన నాకు రామ దర్శనం కలిగింది. తండ్రీ బిడ్డలిద్దరిదీ ఏమి గాంభీర్యం! ఏమి సౌందర్యం! ఒక్కసారి చూస్తే చాలు ఎవరూ మరచిపోలేరు. నేను పొరబడటం లేదు స్వామీ. దయచేసి వేడి చల్లారక ముందే ఆరగించండి. చల్లని నీరు కూడా తెచ్చాను' అన్నాడా వ్యక్తి.

స్వామీజీ కన్నుల వెంట నీరు జల జలా కారింది. ఏ అభయ హస్తమయితే తన జీవితమంతా కాపాడుతూ వస్తుందో, అదే అభయహస్తమిది.

ఎదురుగా నోరు వెళ్ళబెట్టి ఇదంతా చూస్తున్న ఆ ధనవంతుడు ఉన్న పళంగా స్వామివారి పాదాలపై పడి, కన్నీటి ధారలతో స్వామి పాదాలను అభిషేకిస్తూ క్షమాపణ కోరాడు. సన్యాస జీవితమంటే భగవంతుని ఒడిలో జీవించడమని అర్థం అయింది. నిజమైన సన్యాసిని దూషించడమంటే భగవంతుని దూషించడమేనని తెలుసుకున్నాడు.

తనని నమ్ముకున్నవారిని ఎప్పుడూ కంటికి రెప్పలాగా కాపాడుతూ వుంటాడు భగవంతుడు. యోగుల హృదయాలలో సదా నివసిస్తూ వుంటాడా పరమాత్ముడు.

ఇది కేవలం స్వామీజీ జీవితంలో జరిగిన ఒక చిన్న సంఘటన మాత్రమే. ఇంతకు మించినవి, ఎంతో ఆశ్చర్యం కలుగజేసేవి, భగవంతుని పట్ల, యోగుల పట్ల సడలని విశ్వాసం కలుగజేసేవి మరెన్నో!!


బ్రహ్మవ్రాత
మధుప
మిథిలానగరం
1
మహారాజా! మహారాజా! నాకిప్పుడే మృత్యుదేవత ఎదురై నా వంక భయంకరంగా చూసింది!
ఆవిడ చాలా అందంగా, ప్రసన్నంగా ఉంటుందే? అయినా ఇప్పుడు నన్నేం చేయమంటావ్?
2


దయచేసి మీవద్ధ ఉన్న
గుర్రాలలో అత్యంత వేగంగా
పరిగెత్తే గుర్రాన్నినాకు
ఇవ్వండి మహారాజా! దానిపై
నేను తెల్లవారేసరికి అయోధ్య
చేరుకుని సీతమ్మవారి వద్ధ
రక్షణ పొందుతాను.
అలాగే,
తప్పకుండా
తీసుకువెళ్ళు.
3


4


ప్రణామాలు జనక రాజర్షీ!
ప్రణామాలు మృత్యుదేవతా! మా భటుడి వంక కోపంగా చూసావుట?
5


కోపంగా కాదు మహాజ్ఞానీ! ఆశ్చర్యంగా చూశాను. మృత్యువంటే సహజంగా ఉన్న భయం చేత అతనికి భయంకరంగా కనిపించి ఉంటాను.
నిన్ను ఆశ్చర్యపరచిన అంతటి మహత్తర విషయం ఏమిటో తెలుసుకోవచ్చా తల్లీ!
6


నేను యథాలాపంగా ఆ భటుడివైపు చూస్తే అతడి నుదుటిపై ఇతగాడు రేపు ఉదయమే అయోధ్యా నగరంలో మరణిస్తాడు అని వ్రాసి ఉంది. ఇప్పుడు ఇక్కడ ఉన్న ఇతడు రేపు ఉదయానికల్లా అయోధ్య ఎలా చేరుతాడు? ఆహా! బ్రహ్మ వ్రాత తప్పిపోయేట్లు ఉన్నదే అని ఆశ్చర్యంగా చూశాను.
7


బ్రహ్మ వ్రాత తప్పించుకోలేమని తెలిసినా మానవుడు తెలివితక్కువతనంతో ఎన్నో ప్రయత్నాలు చేసి చివరికి విధికి లొంగిపోతాడు తల్లీ! ఆ భటుడు కూడా అలాగే అత్యంత వేగంగా ఇప్పటికే అయోధ్యా నగరం చేరుకొని నీ కోసం సిద్ధంగా ఉన్నాడు. వెళ్ళిరా మాతా!
8

# బాబూజీతో అనుభవాలు

(గత సంచిక తరువాయి) - వి. లక్ష్మీ నరసమాంబ

**మదిలో నీదగు మూర్తినిల్పుకొని సంభావింతుమే కాని నిన్**
**ఇదమిత్థంబని నిర్ణయింప వశమా? యెవ్వారికిన్, నమ్మి నీ**
**పదరాజీవము లాశ్రయించితిమి లోపంబేమి? నీ వారమే గద,**
**రక్షింపక నీకు తప్పదుగదా! కాళీప్రసాదప్రభూ!**

ఆ విధంగా ఐహికమైన బంధాలలోనే సంతోషం పొందాలనుకునేవారికి, వాటి నుండి విముక్తిని పొందినవారికి తన చెంతనూ బాబూజీ సుఖసంతోషాలను ప్రసాదిస్తారు.

**గతజన్మంబుల గొప్ప పుణ్య మెదియో గావించి నిన్జూడ**
**గల్గితి మీ జన్మమునందు, సర్వశుభము ల్సేకూరె। వేయేల? మా**
**వ్రతముల్ పండె, నికేమి గావలయు? నీ వాత్సల్యమేమాకు**
**సద్గతులం గూరిచి కర్మబంధ మెడపున్ కాళీప్రసాదప్రభూ!**

వారి కరుణా కటాక్ష వీక్షణం మన మీద ప్రసరిస్తే గానీ, ఆయన సన్నిధానానికి చేరము. అదే గొప్ప పుణ్య ఫలం! ఆయన సేవ, సంస్మరణ యందే బ్రతుకులు ధన్యమయి సర్వసుఖములు చేకూరుతాయి.

**నమ్మిన వాడు బంగారు పిచ్చుక! నమ్మని వాడికి బూడిద! -** ఈ జీవితంలో కర్మ బంధాలవల్ల కలిగే కష్టాలు అనుభవించక తప్పదు. కానీ బాబు అండదండలతో కష్టాల కడలిని సులువుగా దాటి ఒడ్డు చేరతాము.

**ఏనా డేము భవ త్పదాబ్జముల నెంతే బట్టుకొన్నారమో?**
**ఆనాడే చరితార్థజన్మలము మేమైనార మెట్లేని**
**బాబూ! నీ దృష్టిబడం దృజింప వెటులం బోనీక, ప్రేమించి**
**సుజ్ఞానం బీగల సత్యమూర్తివి కదా కాళీప్రసాదప్రభూ!**

వారి దృష్టి మన మీద ప్రసారం అయి, ఆయన దగ్గరకు చేరుకుంటే చాలు! తక్కిన విషయాలన్నీ వారే చూసుకుంటారు. ప్రేమించి సుజ్ఞానం ఇస్తారు. సరైన త్రోవ వెంట నడుపుతారు.

సుమారు పది పన్నెండు సంవత్సరాలుగా వారిని సమాశ్రయించి, జీవితంలో ఒంటరితనాన్ని, ఒడిదుడుకులను ఎదుర్కొన్న తరువాత, నాకు కలిగిన అనుభవం ఇది. ఇదే రీతిలో సద్గురుమూర్తి కృపా వీక్షణాలు నామీద, ఆయన్ని నమ్ముకున్న భక్తులందరిమీద సదా ప్రసరించుగాక!

(గత సంచిక తరువాయి)

# గురుశక్తి

- పాలూరి కాళీ ప్రసాద్

ఇక ఆధ్యాత్మిక గురువుల విషయంలోకి వస్తే, సృష్టిలోని ఏ వస్తువును, లేదా శక్తిని తీసుకున్నా అంతకంటే పెద్దది, గొప్పది గురుశక్తి. ఆ గురువులు మనకోసం దేహధారణ చేసి వచ్చి, మనకు ప్రసాదించే అమోఘవరం వారి సన్నిధి. ఆ గురుసన్నిధి మన మనస్సులలోని సంకల్పాలను, వాసనలను, బలహీనతలను అధిగమించి, ఏకాగ్రతను సాధించి మనలోనే వున్న బ్రహ్మామృతాన్ని అందుకునే శక్తిని మనకు ప్రసాదిస్తుంది. అలాగే బయట నుండి నిరంతరం మన మనసు మీద దాడి చేసే ప్రాపంచిక విషయాదుల నుండి మనలను కాచి రక్షిస్తుంది.

మన మనస్సులను స్థిరపరచి. మన సంకల్పాలన్నింటినీ బ్రహ్మవస్తువు నందు ఏకీకృతం చేసి, మనకు బ్రహ్మానందాన్ని అందించే మరొక మార్గం ధ్యానాగ్ని. అత్యధిక ఉష్ణోగ్రతకు వేడిచేస్తే ఇనుము అయస్కాంతంగా మారినట్లే, ఈ ధ్యానాగ్ని మనలోని దేహాత్మ భావనను, అహంకార, మమకారములను, పూర్వజన్మ వాసనలను అన్నింటినీ దహించివేసి, మన నిజతత్త్వాన్ని ఎరుకపరచి, పరమశాంతిని మనసుకు అందిస్తుంది. అయితే ఈ ధ్యానం గురువు మార్గదర్శకత్వంలో, వారి సన్నిధిలో చేసినప్పుడు అత్యంత విశేష ఫలితాన్నిస్తుంది.

ఒక వస్తువు యొక్క గురుత్వాకర్షణ శక్తి అత్యధికమైన ప్రభావాన్ని చూపించాలంటే ఆ వస్తువు చేత ఆకర్షింపబడే రెండవ వస్తువు దానికన్నా చాలా చిన్నదై వుండాలి. అలాగే గురుశక్తి మనమీద ప్రభావం చూపించాలంటే, మనం ముందుగా మన అల్పత్వాన్ని గుర్తించి వారికి సంపూర్ణ శరణాగతి చెందాలి. అంతేకాని, గురువుని ఆశ్రయించి కూడా ఇంకా నేనెంతో గొప్పవాడిని, పండితుడిని, మేధావిని అనుకొనేవాడు ఆ గురుశక్తిని అనుభవంలోకి తెచ్చుకోలేడు. గురువుల సన్నిధిలో జీవించడానికి ముఖ్యంగా మూడు సూత్రాలు చెబుతారు - చెప్పినట్టు వినాలి, పెట్టినట్టు తినాలి, చచ్చినట్టు పడివుండాలి.

ఒక్కసారి గురు సమాశ్రయం లభిస్తే ఇక ఆ జీవి తరించినట్లే. శ్రీగురుదేవులు 'నేను కామవరపుకోట జీడిని. ఒక్కసారి పట్టుకుంటే విడిచిపెట్టను' అనేవారు. ఒకవేళ బలవత్తరమైన కర్మప్రభావం చేత ఏ

శిష్యుడైనా వారికి దూరమైనా, ఈ జన్మలో కాకపోతే మరెన్ని జన్మలకైనా వారికి మళ్ళీ గురుసమాశ్రయం తప్పక లభిస్తుంది. అది గురుదేవులు ఇచ్చే గ్యారంటీ.

**ఏనా డేమో భవత్పదాబ్జముల నెంతే బట్టుకున్నారమో?**
**ఆనాడే చరితార్థజన్ములము మేమైనార మెట్లేని**
**బాబూ! నీ దృష్టిబడం దృజింప వెటులం బోనీక, ప్రేమించి**
**సుజ్ఞానం బీగల సత్యమూర్తిని కదా కాళీప్రసాదప్రభూ!**

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులయిన బచ్చు రుక్మాబాయి గారు 12-11-2021 శుక్రవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 86 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.



# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

పరమాత్మ యొక్క ఆనందమయ స్థితి మనం పొందాలి అని అనుకున్నప్పుడు ఈ గుణాలు, మానసిక బలహీనతలు కేవలం విచారణ వల్లనే దగ్ధమవుతాయి. కైవల్యోపనిషత్ అనుభవైకవేద్యమైనది. బ్రహ్మ స్వరూపమైనదియగు ఆ స్వరూపానికి జాతి, వర్ణ భేదాలు లేవు. వివేకచూడామణిలో శ్రీ శంకర భగవత్పాదాచార్యులవారు ఈ విధంగా చెప్పారు - **జాతి, నీతి, కుల, గోత్ర దూరగం, నామరూప గుణదోష వర్జితం, దేశ, కాల విషయాతి వర్తియత్ బ్రహ్మ తత్వమసి భావయాత్మని** అని ఉపదేశవాక్యం అందించారు మనకి.

తత్ - అస్థిత్వం వున్నది అంటే అదొక్కటే వున్నది అది 'నేను' (బ్రహ్మ). బ్రహ్మ లక్షణాలు వున్నాయా మనకి? ఎలా వుంటాయి అవి? ఏది తత్? ఏది త్వమేవ? - ఉనికి అస్థిత్వంతో వున్నదే తత్. త్వమేవ - అది నీవే (నేనే). అన్నింటినీ ప్రకాశింపజేసి, అన్నింటిలోనూ ప్రకాశించేది 'నేనే' అనే స్థితికి తీసుకుని వెడతారు మహాత్ములు. కానీ, మనం కించిజ్ఞులం అనుకుంటాం. ఇదే మాయ. నీటిని కప్పిన నాచులా వుంటుంది. ఈ జీవ భావన తొలగాలి అంటే ఈ గొప్పదైన విషయము నందు ఆసక్తత వుండాలి, అలసత్వం వుండకూడదు. శ్రద్ధ కలిగి వుండాలి.

కైవల్యోపనిషత్ 19వ మంత్రం **మయ్యేవ సకలం జాతం.............. తద్బ్రహ్మాద్వయం అస్మ్యహం** - సృష్టి, స్థితి, లయాలు సమస్తమూ నా వల్లే జరుగుతున్నాయి. సర్వమునకు ఆ పరబ్రహ్మమే ఆధారము. ఆ బ్రహ్మయే నేను. అని పరబ్రహ్మ లక్షణాలే మనకు వున్నాయని ఈ మంత్రం దృఢ పరచింది. మనం తినాలి అనుకుంటేనే తింటున్నాం. మనం ఏదైనా పని చేయాలనుకుంటేనే చేస్తున్నాం. నిద్రపోవాలి అనుకుంటేనే నిద్రపోతున్నాం. ఏది వుంటే ఈ విధంగా చేయగలుగుతున్నాం? దేని ప్రేరణవలన జరుగుతోంది? అది నిరంతరం విచారణ జరుగుతూ వుండాలి. మీరనవచ్చు బోధని శ్రద్ధగా వినడానికే వచ్చాం, కానీ నిద్ర ఎక్కడి నుంచి వస్తోందో మధ్య మధ్యలో వస్తోందని, మేము నిద్రపోవాలని అనుకోలేదనీ అనవచ్చు. ఇటువంటి బోధాశ్రవణం అప్పుడు నిద్ర వస్తోంది అంటే, మనకు శ్రవణం చేసే విషయమునందు ఆసక్తి

లేకపోవటం వలన. చులకన భావన వలనే ఆ విధంగా జరుగుతోంది. ఇవి బ్రహ్మ లక్షణాలు కావు. ఆధ్యాత్మిక సాధనకి అడ్డుపడే బాధలు ఇవి.

ఆ పరబ్రహ్మ సర్వవ్యాపకుడు. అందరికీ, నీకూ ఆధారమని మహాత్ములు ఉద్ఘోషిస్తున్నారు. నిజానికి జీవభ్రాంతితో, కించిజ్ఞత్వంతో కూడిన భావనలని కూడా ప్రకాశింపజేసేది 'ఆత్మ' అని మహాత్ములు పరిపరి విధాల మనకి బోధ చేసి గుర్తించేటట్లు చేస్తున్నారు.

మనోభావాలు ఒక తెరవలే మన సాధనకి అడ్డుపడుతున్నాయి. అందుకనే మనం ఉపనిషత్ ఉపాసన మొదట్లో **భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః** - అనే శాంతి మంత్రం చెప్పుకున్నాం. ఆధ్యాత్మిక, ఆదిదైవిక, ఆదిభౌతిక తాపాలు (బాధలు) శాంతించు గాక! అని దేవతలను ప్రార్థిస్తున్నాము. ఈ మంత్రం మనకి ఎప్పుడూ ఉపయోగపడే మంత్రం. అంతా ఆ భగవత్ శక్తే చేయిస్తోంది అని తెలుస్తుంది. సాధన, అనుభవం రహస్యమైనదే. ప్రపంచంలో వున్న సత్యాన్ని ఎంతవరకూ గుర్తించగలుగుతున్నాం అని ఎవరికి వారు ఎప్పటికప్పుడు పరిశోధించు కోవాలి. అభ్యసించవలసినది ఆధ్యాత్మిక విద్య. అది అందరితో పంచుకోవలసి వచ్చినప్పుడు అంతా బట్టబయలే.

గీతలో 12వ అధ్యాయం భక్తియోగంలో **శ్రేయోహి జ్ఞాన మభ్యాసాత్ ..... ధ్యానాత్ కర్మఫల త్యాగః త్యాగాశ్చాన్తిరనంతరం** - అని శ్రీకృష్ణ పరమాత్మ చెప్పాడు. అంటే జ్ఞానం కంటే ధ్యానం, ధ్యానాని కంటే కర్మఫల త్యాగం చాలా గొప్పది అని చెబితే, దేహ భ్రాంతి వున్న మానవులు కర్మలు చేస్తూ 'నేనే ఇదంతా చేశాను' అని, నేను, నాది అనే అహం భావనతో వుంటాడు. అది బయటకు కనిపించదు. శ్రీగురుదేవులు దానినే పంపు దగ్గర నాచులాగ కనబడకుండా వుంటుంది అని చెప్పేవారు. పంపుదగ్గర నీళ్ళు పట్టుకోవడానికి వెళ్ళినప్పుడు అడుగులు సరిగా వేసి నడవకపోతే, ఆ మనిషి జారి క్రిందపడతాడు. నడుం విరుగుతుంది. అలాగే ఈ అహం భావన వంటి భావనలు, సాధనకు చాలా అవరోధం కలిగించి, సాధకుడిని క్రింద పడవేస్తాయి. ఉపనిషత్తు అంతా రాకపోయినా, పైన చెప్పిన శాంతి మంత్రం అయినా అనుకుంటూ వుంటే శ్రవణం చేసిన బోధ విచారణ చేస్తూ వుంటే అదే తత్ త్వమేవ అయి వుంటాము.

- సశేషం

# పరమాత్ముని పట్ల కృతజ్ఞత

సేకరణ - కె. రాఘవ రాజు

ఈ శరీరం నిలబడటం (భుక్తి) కోసం మనం మనకు నిర్ణయించిన కాలమునకు, మనం మన పనిని చేస్తున్నామా? లేదా? ఉదాహరణకు ఒక ఉద్యోగి ఆ టైమ్‌కు ఆఫీసుకు వెడుతున్నాడా? లేదా? ఇదంతా ఎందుకు? భుక్తి కోసమే కదా! ఒక్కొక్క రోజు అదనపు ఆదాయం ఇస్తామంటే 8గంటల కంటే ఇంకా ఎక్కువ సమయం పని చేస్తున్నామా? లేదా? మరి భగవంతుడు మనకు ఈ మానవ ఉపాధి శరీరాన్ని ఇవ్వకపోతే మనం ఇవన్నీ చేయగలమా? మన ఉపాధి కాక ఏ కుక్కో, నక్కో, పిల్లో అయితే ఇది సాధ్యపడుతుందా?

మరి భగవంతుడు మనకు ఇంత గొప్ప శరీరాన్నిచ్చి, దీనితో వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు చదివి అర్థం చేసుకునే శక్తినిచ్చి, పెద్దలు చెప్పిన విధంగా బ్రతకమని, నిత్యమూ ధర్మాన్ని గురించి ఆలోచిస్తూ, సత్య భాషణ చేస్తూ, పరోపకారియై, ధర్మాన్ని రక్షిస్తూ, నిత్యమూ భగవంతుని పూజలో, ధ్యానములో బ్రతకమని భగవంతుడు మనకు అవకాశాన్ని ఇస్తే దానిని ఇలా వృథా చేయడం న్యాయమేనా?

మనం మాతృ గర్భంలో వున్నప్పుడే భగవంతుని ప్రార్థించాం. ప్రమాణం చేశాం. 'భగవంతుడా! నన్ను త్వరగా ఈ మురికి కూపం (మాతృ గర్భం) నుండి బయటపడవేయి! నేను బయటకు వచ్చాక నీకు కృతజ్ఞుడుగా వుంటూ, నిత్య పూజ, భజనాదులతో, ధ్యానముతో నిన్ను మరువను. పొరపాటున కూడా సంసార బంధనలో చిక్కుకోను. నన్ను నమ్ము' అని మాట ఇచ్చి, ప్రమాణము చేసి, ప్రస్తుతము మనం చేస్తున్న పనేమిటి? రోజుకి ఒక గంట సేపైనా స్వామికి పూజ చేయడానికి మనకు తీరిక సమయం లేదా? పురాణ ప్రవచనం వినడానికి గానీ, ఆలయానికి వెళ్ళి స్వామిని దర్శించడానికి గాని మనకు తీరికే లేదా? మరి మిగతా పనులు చేయడానికి, వ్యర్థ ప్రసంగాలు చేయడానికి, పరనింద చేయడానికి తీరిక సమయం పుష్కలంగా దొరుకుతుందా?

ఈ మానవ ఉపాధి, శరీర పోషణకు ఆహారము, నీరు, గాలి, వెలుతురు ఎంత అవసరమో, మనలోని జీవాత్మకూ, పరమాత్మల పోషణకు సత్యభాషణమూ, ధర్మానుష్ఠానము, నిత్యపూజ, నిరంతర స్మరణ అంతే అవసరం!!

## శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**డిసెంబర్ 2021 -**

1 బుధ - హోమం పూర్ణాహుతి, దీక్షా విరమణ

2 గురు - మాస శివరాత్రి

3 శుక్ర - శ్రీగురుదేవులు స్వస్వరూప లయం చెందిన తేదీ - శ్రీ సద్గురుపాదపూజ, భక్తసమారాధన.

4 శని - అమావాస్య

9 గురు - సుబ్రహ్మణ్య షష్ఠి

14 మంగళ - గీతాజయంతి

16 గురు - ధనుర్మాస వ్రత ప్రారంభం - ప్రతిరోజు ముకుందమాల, తిరుప్పావై, మహర్షుల చరిత్రలు, శ్రీమదాంధ్రమహాభాగవత ప్రవచనము, సత్సంగం జరుగును.

18 శని - మార్గశిర పూర్ణిమ, దత్త జయంతి - శ్రీసద్గురుపాదపూజ

25 శని - క్రిస్‌మస్ - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

29 బుధ - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

**జనవరి 2022-**

1 శని - మాస శివరాత్రి, ఆంగ్ల సంవత్సరాది - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన

2 ఆది - అమావాస్య

13 గురు - ముక్కోటి ఏకాదశి - ఉత్తర ద్వార దర్శనము - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

14 శుక్ర -భోగి - ఉత్తరాయణం - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన, రాత్రి 8గం. శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట.

15 శని - సంక్రాంతి - శనిత్రయోదశి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన

16 ఆది - కనుమ

17 సోమ - పుష్య పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

27 గురు - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

30 ఆది - మాస శివరాత్రి

# వేంకటాద్రి

సేకరణ - మురళీ

శ్రీ వెంకటాద్రి 1807 వ సం. మార్చి 23 న కృష్ణాజిల్లా, నందిగామ తాలూకా, అల్లూరు అగ్రహారంలో జన్మించారు. తండ్రి వెంకయ్య, తల్లి వెంకమ్మ. వెంకటాద్రి బడిలో చదువుకుంటూ తోటి పిల్లలతో కలిసి అడవిలో ఆవులను మేపుటకు వెళ్ళేవాడు. ఒక రోజు మండుటెండలో ఆవులను మేపుతూ అలసిపోయి అడవిలో ఒక చెట్టుక్రింద నిద్రపోయాడు. చెట్ల ఆకుల సందులలో నుంచి ముఖంపై ఎండ పడుతుంటే ఒక కృష్ణసర్పం పడగవిప్పి నీడ పట్టింది. ఇది చూచిన తోటి పిల్లలు భయపడి ఇంటికి వెళ్ళిపోయారు.

వెంకటాద్రికి స్వప్నంలో హనుమత్సమేత సీతా రామ లక్ష్మణులు దర్శనం యిచ్చారు. రాములవారి అనుమతితో లక్ష్మణ స్వామి వెంకటాద్రి నాలుకపై బీజాక్షరాలు వ్రాసిన తరువాత అందరూ అదృశ్యమయ్యారు. ఆరోజు నుండి వెంకటాద్రి నడవడికలోను, మాట తీరులోను మార్పు వచ్చింది. ఊరి బయటగల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పుష్పాలతో అర్చిస్తూ రేయింబవళ్ళు భజనలు చేయటం దినచర్యగా మారింది. వెంకటాద్రి భజనలకు సంతోషించి, శ్రీ నరసింహదాసు గారు వెంకటాద్రికి తారకమంత్రం ఉపదేశించి దీవించారు.

వెంకటాద్రి నిరంతరం తారకమంత్రం జపిస్తూ సీతారాముల పైన, హనుమంతునిపైన కీర్తనలు ఆశువుగా పాడుతూ, నృత్యం చేస్తూ గడుపుతుండేవాడు. కొంతకాలం తరువాత భద్రాద్రి రాములవారిని దర్శించుకోవాలి అనిపించి భద్రాచలం వెళ్ళాడు. అక్కడ నిత్యమూ సంకీర్తన చేస్తూ, రామకోటి వ్రాస్తూ సుమారు 5 సం. గడిపాడు. తరువాత కొంతమంది భక్తులతో కలిసి శ్రీరంగం వెళ్ళటానికి ప్రయాణం అయ్యాడు.

మార్గమధ్యంలో తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకుని, తీర్ధయాత్ర చేస్తూ కంచి చేరుకున్నారు. తిరుక్కచ్చినంబి, ఇళయాళ్వారులు పుష్పకైంకర్యం చేసి భగవంతుని కృపకు పాత్రులయ్యారు గదా అని తను కూడా పూలతోటలు పెంచి నిత్యము శ్రీ వరదరాజస్వామికి, శ్రీ పెరుందేవితాయార్లకు పూలమలలు సమర్పిస్తూ ఉండేవారు. ఒక రోజు పువ్వులు కోస్తుండగా ఒక కృష్ణసర్పం ఆయనను

కరచింది. అది చూసిన ఇతర భక్తులు చికిత్స చేయించుటకు ప్రయత్నిస్తే, ఆయన నిరాకరించి, పుష్కరిణిలో స్నానం చేసి, తంబూర మీటుతూ వరదరాజస్వామి ఎదుట నృత్యం చేస్తూ కీర్తనలు పాడారు. కొంత సేపటికి ముచ్చెమటలు పోసి, సర్వ విషం హరించబడింది. దీనితో కాంచీపురం పరిసర ప్రాంతాలలో వెంకటాద్రి ప్రహ్లాదుని వంటి భక్తుడని పేరు వచ్చింది.

వెంకటాద్రి స్వామి తీర్థయాత్రలు చేస్తూ అనేక ఆలయాల జీర్ణోద్ధరణ చేయించి, దక్షిణ దేశ యాత్రలు పూర్తి చేసుకుని శ్రీరంగం చేరుకున్నారు. శ్రీ రంగనాధుని నిత్యమూ సేవించుకుంటూ, తన శరీరంలో పటుత్వం తగ్గుతోంది, జీవితం అంతిమదశకు చేరుకుంటోందని గ్రహించి శ్రీరంగం నారాయణ జియ్యరు వారి మఠం చేరుకున్నారు. అక్కడ జియ్యరు స్వామి వారి వద్ద ఉపదేశం పొంది, త్రిదండ కాషాయములు ధరించి, "శ్రీ తిరువేంగడం రామానుజ జియ్యరు" అనే నామం స్వీకరించారు.

ప్రతి దినము ఉదయం నుండి అర్ధరాత్రి వరకు శ్రీ రంగనాధుని సేవిస్తూ ఉండేవారు. నిత్యమూ స్వయముగా గంధం నూరి రంగనాధునికి సమర్పించేవారు. ది. 5-2-1877 సోమవారం రోజున కావేరీ నదీజలాలు తెప్పించి, స్నానము ఆచరించి, కంచి శ్రీ వరదరాజ స్వామికి, శ్రీ పెరుందేవికి ఆరాధన చేసి, పద్మాసనంలో అష్టాక్షరీ మంత్రం జపిస్తూ ఉండిపోయారు. అర్ధరాత్రి శ్రీ రంగనాధుని ప్రసాదం స్వీకరించి, కపాలం ఛేదించుకుని బ్రహ్మీభూతులైనారు.

శ్రీ వెంకటాద్రి స్వామి ఆశువుగా చెప్పే కీర్తనలకు ఆంధ్ర తమిళ దేశాలలోని భక్తులు తన్మయత్వం చెందేవారు. ఇటువంటి మహనీయుల చరిత్రలు భావితరాల వారికి మార్గదర్శకం వహిస్తాయి.

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

"మీకు సమయం చాలా విలువైనది కదా? మన్నించాలి. కాని ఏం చేస్తాం? మాకూ కొన్నినియమానుష్టానములుంటాయి కదా? అందువలననే ఈ ఆలస్యం.

ఒక తమాషా తెలుసా? మంత్రులను, గొప్ప గొప్ప పదవులలో ఉన్నవాళ్ళని కలుసుకొనడానికి గంటలకొలదీ వేచివున్నప్పుడు మనకు అసహనం, చిరాకు వంటివి కలుగవు. కానీ, ఆ ఏడుకొండలవాడిని దర్శించుకోవడానికి నిరీక్షించేటప్పుడు మాత్రం 'మనకు బోర్ కొడుతుంది!' అని బాబూజీ అంటుంటే, మాకు కాస్త సిగ్గేసిందనే చెప్పాలి.

చిరుమందహాస వదనముతో శ్రీబాబు మా దగ్గరకు వచ్చి మమ్మల్ని ఆశీర్వదించి "మీకు వశిష్ఠ మహామునుల జీవితంలో జరిగిన ఒక అనుభవమును గూర్చి చెప్తాను. వినండి!" అన్నారు. మనకందరికీ తప్పకుండా తెలియవలసిన విషయమది. సద్గురువులు కథ చెప్పారంటే, తప్పకుండా అందులో మనం తెలుసుకోవలసిన గొప్ప విషయం ఏదో ఒకటి ఉండే తీరుతుంది. మెల్లగా ఆయన కథ చెప్పడం ఆరంభించారు.

ఒకసారి వశిష్ఠులు తన మానసిక తండ్రియైన బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళి "తండ్రీ! మీ ఆజ్ఞానుసారము సూర్యవంశమునకు చెందినవాడైన ఇక్ష్వాకురాజు మొదలుకొని కకుస్థుడు, మాంధాత, ముచికుందుడు, త్రిశంకు, హరిశ్చంద్రుడు, సగరుడు, భగీరథుడు, అంబరీషుడు, ఋతుపర్ణుడు, దిలీపుడు మొదలైన అరవైకి పైబడి అయోధ్యరాజులకు ఆచార్యునిగా వ్యవహరించాను. పుత్రభాగ్యము లేనటువంటి దిలీపుడు కూడా మా ఆశ్రమ పశువైన కామధేనువు నందినికి ఒక మండలకాలము పూజచేసి శాపవిమోచనం పొంది, "రఘు"యను ఒక ఉత్తమ పుత్రునికి తండ్రియగు భాగ్యమును పొందాడు. ఇంతటితో నా బాధ్యత ముగిసిందని భావిస్తున్నాను. నాకు కూడ ఈ భూమండల జీవితమందు విరక్తి కలుగుచున్నది. దయచేసి నన్ను

మీయొక్క సత్యలోకమునకు తిరిగి తీసుకొని వెళ్ళమని వేడుకొంటున్నాను" అన్నాడు.

బ్రహ్మదేవుడు చిరునవ్వుతో 'కుమారా! వేడి వేడిగా వంట చేసి పెట్టేవాడికి రుచి చూచేందుకు ఆ వేడి తగ్గేవరకు వేచివుండటం శక్యముకాదు!' అంటుంటారు కదా..నీ విషయంలో అది నిజమేననిపిస్తుంది. నీ కోసమే వేచియున్న ఒక మహోద్భుతమైన సంఘటనను గూర్చి నీకు తెలియడంలేదు. కాబట్టి ఆ గొప్ప సంఘటనకై నీవు ఇంకొన్ని తరముల వరకు రఘువంశస్థులకు ఆచార్యునిగా వ్యవహరించవలసిందే!" అని బదులిచ్చాడు బ్రహ్మదేవుడు.

"అటువంటి గొప్ప సంఘటన ఏమి జరుగబోవుచున్నది తండ్రీ!"

"నీ ఆజ్ఞానుసారము వ్రతమొనరించిన దిలీపునికి పుత్రునిగ జన్మించిన రఘువుయొక్క కులమందు, ఆ ఆదివిష్ణువే ఒక కుమారునిగ అవతరించి, నీ ద్వారా 'రామ' యను పేరును పొంది, నీకు శిష్యునిగా ఉండబోవు అతి గొప్ప మహద్భాగ్యము నీవు చేజార్చుకోదలచావా!?"

''ఆ ఆది మహా విష్ణువు నాకు శిష్యుడా!? అంతటి పురుషోత్తమునికి, మహాజ్ఞానికి నేను ఆచార్యుడనా!? ఇది ఏమి వైపరీత్యము తండ్రీ!?"

"అవును.. ఇది అంతా ఆ శ్రీమహావిష్ణువుయొక్క దివ్యలీలా వినోదము. తానెత్తబోవు మానవ అవతారమందు నిన్ను ఒక ఉన్నత స్థితికి తీసుకునివెళ్ళ ఆ మహావిష్ణువు నిశ్చయించారు. కాబట్టి ఈ భూలోకమందు నీ బాధ్యత ఇంకా ముగిసిపోలేదు. అందుచేత, ఆ రాముడు వచ్చే సమయమువరకు నిరీక్షించవల్సిందే!" అన్నాడు బ్రహ్మదేవుడు వశిష్ఠునితో.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# సద్గురు

- సుషుమ్న ప్రసాద

అంతేకాక, కేవలం సరియైన మార్గం తెలుసుకుంటే చాలదు. ఆ మార్గము ఎన్నో కంటకములతో కూడినది. ఆ మార్గంలో చరించటానికి అసాధారణమైన ధైర్యం, ఓర్పు కూడా కావాలి. పట్టుదలతో చివరి వరకు వదలకుండా వుండే శక్తి కావాలి. ఆ శక్తి ఎక్కడ వున్నది? అది నీలోనే వున్నది. కాని దాన్ని నీవు ఉద్దీపింపజేయలేవు. నీలోని నిద్రాణమైన శక్తిని మేల్కొలిపి, దాన్ని బయటకు తీయగల నేర్పరి, సమర్థుడైన గురుదేవుడు మాత్రమే.

కురుక్షేత్ర సంగ్రామంలో, అర్జునుడు ఉభయ సేనల మధ్య రథాన్ని నిలుపమని రథసారథి, తన జీవనసారథి కూడా యైన కృష్ణపరమాత్మను కోరాడు. అక్కడ వున్న శత్రుసేనను పరికించి చూసి, బంధు ప్రీతితో, మమకార పాశంతో, గాండీవాన్ని విసర్జించి, రక్తపాతమును సృష్టించకుండా, రణరంగానికి స్వస్తి చెబుతానన్నాడు అర్జునుడు. అలా నిరాశా నిస్పృహలకు లోనైన పార్థునకు, పార్థసారథి అయిన శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతా ప్రబోధంతో, శక్తిహీనతను పారద్రోలి, కార్య విముఖతకు స్వస్తి చెప్పి, కార్యోన్ముఖుణ్ణి చేశాడు. సద్గురుదేవుని సమర్థతకు అంతకు మించిన తార్కాణమేమున్నది?

అంతేకాక, మన స్వానుభవంలోనే చూశాం కదా, ఎన్నో విషయాలలో నిరాశ, నిస్పృహలతో వచ్చిన భక్తులకు తన అనుగ్రహము, వాత్సల్యములతో ప్రోత్సాహాన్నిచ్చి, మనస్సును సద్గురు పాదపద్మములయందు లగ్నం చేసి, కార్యోన్ముఖులుగా చేసిన మహనీయులైన గురుదేవుడు.

గురుదేవుని ఆశ్రయించి, గురువాక్యమును విని ఆచరించుట బానిసత్వమనుకోవటం చాలా అవివేకం. సద్గురుని వ్యక్తిత్వం మన వ్యక్తిత్వం లాంటిది కాదు. సత్యము, ధర్మము, సర్వభూత దయతో విరాజిల్లుతుంది. వారు సాక్షాత్తు పరమేశ్వరుడే! వివేక చూడామణిలో శ్రీ శంకర భగవత్పాదాచార్యులవారు ఇలా వర్ణించారు.....

**శ్రోత్రియో వృజినా కామహతో యో బ్రహ్మవిత్తమః**

**బ్రహ్మణ్యపరతః శాంతో నిరింధన ఇవానలాః**

**అహేతుక దయాసింధురా నమతాం సతామ్**

అంటే వేద ఉత్పన్నుడు, పాప రహితుడు, వాంఛలు లేనివాడు, ఉత్తమ బ్రహ్మజ్ఞాని, బ్రహ్మమందు లయించిన వాడు, శాంతుడు, పూర్తిగా దగ్ధమైన నిప్పువలె శాంతమూర్తి, నిర్హేతుక దయా సముద్రుడు, సత్పురుషులకు మిత్రుడయినవాడును గురువు.

పైన ఉదహరించిన లక్షణాలతో ప్రకాశించే గురుమూర్తి మనకు లభించడమనేది మన పూర్వ జన్మల పుణ్య విశేషము. అట్టి మహనీయులు మేము బ్రహ్మజ్ఞానమును పొందినవారమనే గర్వంతో వుండరు. పండితులైనా, పామరులైనా, ధనవంతులయినా, బీదవారైనా, అందరినీ సమదృష్టితోనే ప్రేమిస్తారు. తారతమ్యము వుండదు. వారి బోధలన్నీ సామాన్యులకు అర్థమయ్యేరీతిలో సాధారణమైన సరళ భాషలో వుంటాయి. వారు కపటవేషధారులైన యోగులు కారు. నిశ్చలమైన భక్తితో, అచంచలమైన విశ్వాసంతో సద్గురుమూర్తిని ఆశ్రయించిన శిష్యుడు గురుమూర్తిలో లయించడమనేది అక్షర సత్యము.

**మన ఆశ్రమ హాస్పిటల్ డాక్టర్లు మరియు సిబ్బంది అవసరార్థులకు నిరంతరం వైద్యసేవ అందిస్తూ వున్నారు. అక్టోబర్ 2021లో1280 పేషంట్స్‌కి ఉచితంగా వైద్యసేవలు అందించటమే కాకుండా,113 స్కానింగులు, 30 కాన్పులు మరియు 6 పెద్దాపరేషన్లు పూర్తిగా ఉచితముగా చేయడం జరిగింది. క్లిష్ట పరిస్థితిలో జన్మించిన శిశువుకు 5రోజులు ఉచితంగా చికిత్స అందించి, ఆరోగ్యంగా ఇంటికి పంపడమైనది. ఇంత పెద్ద ఎత్తున వైద్య సేవలు అందించిన వైద్యులకు, ఇతర సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు. అలాగే ఈ మహత్కార్యానికి సహాయ సహకారాలు అందించిన భక్తులు మరియు దాతలకు శ్రీ గురుదేవులు అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను, ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాము.**

**కార్య నిర్వాహక వర్గము**

**SHKVPB Trust Hospital**

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీహరి రావుగారితో శ్రీ బాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

18-4-1967 : శ్రీ బాబు శ్రీహరిగారితోను, కుమార్తె భారతితోను 15వ తేదీన ఏలూరు నుండి గుంటూరు వస్తుండగా కారు ప్రమాదానికి గురైంది. 'అమ్మా!' అని జగజ్జననిని స్మరిస్తూ శ్రీ బాబు అందరికి తగలవలసిన దెబ్బలన్నీ తమపైకి తీసుకున్నారు. వారికి బాగా దెబ్బలు తగిలాయి. గుంటూరు పాండుగారింట్లో ఉన్నారు. భక్తులెవరో వచ్చి, శ్రీ బాబు ఎలా ఉన్నారో అని దిగులు పడుతుంటే , తామే బయటకు వచ్చి, "వీణ్ణి చూద్దామని వచ్చారా! వీడికేం! ఎప్పుడూ దర్జాగానే ఉంటాడు" అని, అక్కడే ఉన్న గయను (భక్తురాలిని) పిలిచి హార్మోణియం తెప్పించి 'యమునా కల్యాణి రాగం వాయించ'మన్నారు. ఆమె వాయిస్తుంటే తామే వచ్చి "అలా కాదు? ఇలా" అని వాయించి చూపించారు.



ఆ తరువాత కంచి కామకోటి  పీఠ పరమాచార్యులైన చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి వారిని గురించి ఎవరో  చెబితే, "వారు మహాత్ములు. మహా తపస్సంపన్నులు. అటువంటి  జాతి రత్నాలకెందరికో జన్మనిచ్చిన మన మాతృభూమి రత్నగర్భ అయింది. ఆధ్యాత్మిక ఆచార్య పీఠమైన మన భారత దేశంలో జన్మించటమే ముక్తి. విదేశాలవారైనా సరే యిక్కడ జన్మ ఎత్తి తరించ వలసినదే" అన్నారు.

19-4-1967 : శ్రీరామ నవమి. పాండుగారింట్లో పూజ, సత్సంగ సమావేశము జరిగాయి. సమావేశంలో శ్రీ బాబు  "శ్రీ రామ నవమి గనుక యీరోజు  వాన పడి తీరవలసినదే. వరుణ దేవునికి శ్రీ రామ ప్రభువుపై అంత ప్రేమ" అన్నారు.  ఆ సాయంత్రమే బ్రహ్మాండమైన వాన కురిసింది.

12-5-1967 : వైశాఖ శుద్ధ తదియ. తునిలో శ్రీ కాళీ జయంతులు

కాపుగంటి పాపారావు గారింట్లో జరిగాయి. పూజా పీఠముతో బాటు శ్రీ బాబును ఊరేగింపుతోను, సంకీర్తనతోను, వేదమంత్ర పఠనముతోను దాసరి దేవళ్ళు గారింటి నుండి తీసుకుని వెళ్ళారు. శ్రీ బాబు "ఈ అట్టహాసం మనకెందుకయ్యా?" అని వారించే ప్రయత్నం చేశారుగాని దాసరి దేవళ్ళుగారు "ఇది తమ బిడ్డలమైన మా అందరి ప్రగాఢమైన కోరిక బాబూ! మా కోసమైనా తమరు అనుగ్రహించండి" అని వేడుకుని శ్రీ బాబుని సమ్మతింప చేశారు.

14-5-1967 : శ్రీ శంకర జయంతి. శ్రీ బాబు సత్సంగ సమావేశములో తమ బోధామృతాన్ని అందజేస్తూ "మానవుడు తనను గూర్చి తాను తెలుసు కోవటానికి చేసే ప్రయత్నమే సాధన. తన లోపల, వెలుపల, సృష్టి అంతటా నిండి ఉన్న వస్తువే ప్రజ్ఞానము. అంటే తెలివి. అదే బ్రహ్మము. అంటే అంతటా వ్యాపించి ఉన్నది. అదే తాను. అది కానిది రెండవదేదీ జాగ్రతలోగాని, స్వప్నంలో గాని, సుషుప్తిలో గాని, భూత, భవిష్యద్వర్తమానములలో గాని లేదు.

శ్రీ శంకర భగవత్పాదాచార్య స్వామివారు రచించిన 120 గ్రంథములన్నిటి సారాంశమూ యిదే. దీనిని తన శిష్యులకు తెలిపి, యీ సత్యమును అనుభవపూర్వకంగా ఋజువు చేసుకోవటానికి వారికి త్రోవ చూపి మార్గదర్శకులై నడిపించి గమ్యం చేర్చే యేకైక ఆత్మబంధువే సద్గురువు. అటువంటి గురువులు యుగయుగాలుగా ఎందరెందరో ఎప్పటికప్పుడు ఆవిర్భవించి మానవాళిని తరింపచేస్తూనే ఉన్నారు" అన్నారు శ్రీ బాబు.

19-5-1967 : శ్రీ బాబు తమ దివ్య బోధనందిస్తూ 'కట్టె, కొట్టె, తెచ్చె' అనే మూడు మాటలలోనే సాధన సారాంశమంతా యిమిడి ఉన్నది. మనస్సును 'కట్టి', అహంకారమును 'కొట్టి', ముక్తికాంతను 'తెచ్చెను' అని దాని అర్థం. భగవానుని మనం ప్రేమించటం చాలదు. ఆయన మనను ప్రేమించే విధంగా ఆచరించుకోవాలి. ఆయన ప్రేమను పొందిన జీవుడు ధన్యుడు" అన్నారు.

- సశేషం




-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

# శ్రీ కులశేఖరాళ్వారులు

శ్రీబాబూజీ మహరాజ్ వారు, శ్రీ మాతాజీ వారు, శ్రీ కుల శేఖరులు వ్రాసిన "ముకుందమాల"లోని శ్లోకాలు ఎన్నో సార్లు తమ అనుగ్రహభాషణములలో ఉగ్గడించి, ఆ శ్లోకార్థాలను వివరించేవారు. వారు మెచ్చిన మచ్చు తునకలైన కొన్ని శ్లోకాలను,వాటి తాత్పర్యాల వివరణనిస్తున్నాము. వాటిని చదివిన వారిలో భగవద్భావం తప్పక వెల్లి విరుస్తుంది.



శ్లో ॥ **ముకుంద మూర్ధ్నా ప్రణిపత్య యాచే**
**భవంత మేకాంత మియంత మర్థం**
**అవిస్మృతిః త్వచ్చరణారవిందే**
**భవే భవే మేఽ_స్తు భవత్ప్రసాదాత్ ॥**

తా ॥ ముకుందా! నీకు మ్రొక్కి నేను ప్రార్థించునదేమనగా, నీ పాదారవిందములను జన్మ జన్మలకు మరువకుండునట్లు అనుగ్రహింపుము.

శ్లో ॥ **కృష్ణ త్వదీయపద పంకజ పంజరాన్తం**
**అద్యైవ మే విశతు మమ మానస రాజహంసః**
**ప్రాణ ప్రయాణసమయే కఫవాత పిత్తైః**
**కంఠావరోధనవిధౌ స్మరణం కుతస్తే ॥**

తా ॥ కృష్ణా! మరణ సమయంలో నీ స్మరణ చేయగలనో లేదో. అప్పుడు కఫ వాత పైత్యములు నా కంఠాన్ని మూసివేస్తే, నీ స్మరణ కలుగుతుందో, కలుగదో! కాబట్టి నా మనస్సు అనే రాజహంస ఇప్పుడే నీ పద పంజరము చేరి యుండుగాక!

శ్లో ॥ **చింతయామి హరిమేవ సంతతం**
**మంద మంద హసితాననాంబుజం**

**నంద గోప తనయం పరాత్పరం**

**నారదాది మునిబృంద వందితం ॥**

తా ॥ నారదాది మునులచే సేవింపబడుతున్న వానిని, పరాత్పరుని, నందుని కుమారుని, చిరునవ్వులొలికించే వానిని నేను ఎల్లప్పుడూ ధ్యానించుచుందును గాక!

శ్లో ॥ **జిహ్వే కీర్తయ కేశవం, మురరిపుం చేతో భజ శ్రీధరం**

**పాణి ద్వంద్వ సమర్చ యాచ్యుత కథాః శ్రోత్రద్వయం త్వం శ్రుణు**

**కృష్ణం లోకయ లోచనద్వయ హరేర్గచ్ఛాంఘ్రి యుగ్మాలయం**

**జిఘ్రఘ్రాణ ముకుంద పాద తులసీ మూర్ధన్నమాధోక్షజం ॥**

తా ॥ ఓ నాలుకా! కేశవుని కీర్తింపుము. ఓ మనస్సా! శ్రీధరుని భజింపుము. ఓ చేతులారా! భగవదర్చన చేయండి. చెవులారా! అచ్యుతుని కథలను వినండి. కనులారా! శ్రీకృష్ణుని చూడండి. పాదములారా! విష్ణువు యొక్క ఆలయమునకు వెళ్ళండి. నాసికా! ముకుందుని పాదములనలంకరించిన తులసిని ఆఘ్రాణించు. ఓ శిరస్సా! అధోక్షజునికి నమస్కరించు.

శ్లో ॥ **బద్ధేనాంజలినా నతేన శిరసా గాత్రై స్సరోమోద్గమైః**

**కంఠేన స్వర గద్గదేన నయనే నోద్గీర్ణబాష్పాంబునా!**

**నిత్యం త్వచ్చరణారవిందయుగళ ధ్యానామృతా స్వాదినాం**

**అస్మాకంసరసీరుహాక్ష! సతతం సంపద్యతాం జీవితమ్ ॥**

తా ॥ పుండరీకాక్షా! నీకు పట్టిన అంజలి, వంచిన శిరస్సు, గగుర్పొడిచిన అవయవములు గద్గదమైన కంఠము, కన్నీరు నిండిన కనులూ –ఎల్లప్పుడూ నీ పాద ధ్యానములో గడుచునట్టి జీవితమును ప్రసాదింపుము.

శ్లో ॥ **మజ్జన్మనః ఫలమిదం మధుకైటభారే**

**మత్ప్రార్థనీయ మదనుగ్రహ ఏష ఏవ**

**త్వద్భృత్య, భృత్య పరిచారక భృత్య భృత్య**

**భృత్యస్య భృత్య ఇతి మాం స్మర లోకనాథ ॥**

తా ॥ ఓ లోకేశ్వరా! నా ఈ కోర్కెను ఈడేర్చి నన్ను అనుగ్రహింపుము. నన్ను నీ భృత్యుని, భృత్యుని, పరిచారకుని భృత్యునకు భృత్యునిగా ఉంచుము. అదియే నా జన్మ ఫలము.

శ్లో ॥ **నమామి నారాయణ పాద పంకజం**
**కరోమి నారాయణ పూజనం సదా**
**వదామి నారాయణ నామ నిర్మలం**
**స్మరామి నారాయణ తత్త్వ మవ్యయం ॥**

తా ॥ శ్రీమన్నారాయణుని పాద పద్మములకు నమస్కరింతును. శ్రీమన్నారాయణుని సదా పూజింతును. శ్రీమన్నారాయణుని నిర్మలమైన నామాన్ని పలుకుతాను. అవ్యయమైన శ్రీమన్నారాయణుని తత్త్వాన్ని స్మరిస్తాను.



Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on 5th and 6th of every month.

RNI No. : 37804/81
Postal Regd. No. : GTR/27/2021-2023

శ్రీ దేవీ నవరాత్రి ఉత్సవములలో ఆశ్రమ చిన్నారుల నాట్య ప్రదర్శన దృశ్యములు













If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508,
Guntur Dist., A.P.